

టీబీ డ్యాంలో 35 టీఎంసీల నీరు

తుంగభద్ర జలాశయంలో శనివారం 35.326 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 0, అవుట్‌ఫ్లో 8,906 క్యూసెక్కులు.



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6.50, సరాసరి రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.5°/19.2°

జిల్లా అంతటా శనివారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు ఈశాన్యం దిశగా వీచాయి.

న్యూస్‌రీల్

ఆలయాల మూసివేత



లక్ష్మీనృసింహుని ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

ఉరవకొండ: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ప్రసిద్ధ పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ తలుపులను అర్చకులు శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు మూసివేశారు. ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, ఈఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రహణ మోక్షకాలం అనంతరం ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఆలయ తలుపులు తెరుస్తామన్నారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం ఉదయం 6.30 గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతిస్తామన్నారు.

నేమకల్లు ఆలయం మూత

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాన్ని మధ్యాహ్నం మూసివేసినట్లు ఈఓ నరసింహారెడ్డి, ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి తెలిపారు. అంతకుముందు కర్నూలు దేవదాయశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రసాద్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా గాలి గోపురం పెయింటింగ్, దేవాలయ నూతన ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర, అటెండర్ ఓబన్న, మాజీ ధర్మకర్త వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: పాక్షిక చంద్రగ్రహణం దృష్ట్యా శనివారం సాయంత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానాన్ని మూసివేశారు. చంద్రగ్రహణం అనంతరం ఆదివారం ఉదయం నుంచి భక్తులను దర్శనానికి అనుమతి కల్పిస్తారు.

అర్హత ఉంటే ఇంటి స్థలం

- రెండో విడతలో పట్టాల పంపిణీకి సన్నాహాలు



అనంతపురం అర్బన్: ప్రజా సంక్షేమం లక్ష్యంగా జగన్ సర్కార్ పాలన సాగిస్తోంది. అర్హత మాత్రమే ప్రామాణికంగా తీసుకుని పథకాల ఫలాలను పేదలకు అందిస్తోంది. ఇప్పటికే అర్హులైన వారందరికీ ఇంటి పట్టాలను ఇవ్వడమే కాకుండా సొంతింటి కలను సాకారం చేస్తోంది. ఇదే క్రమంలో రెండో విడతగా అర్హులైన వారికి ఇంటి స్థలం ఇచ్చేందుకు రెవెన్యూ యంత్రాంగం సన్నాహాలు చేపట్టింది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. అందులో 21,406 మంది అర్హులను గుర్తించింది. అనంతపురం రూరల్, రాప్తాడు పరిధిలో ఇంటి స్థలాలకు అనువైన 173 ఎకరాలను అధికార యంత్రాంగం గుర్తించింది. గుంతకల్లు, తాడిపత్రి రూరల్, అర్బన్, గుంతకల్లు అర్బన్, గుత్తి అర్బన్ ప్రాంతాల్లోనూ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు స్థలాలను ఎంపిక చేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఇప్పటికే స్థలాన్ని అనుభవిస్తున్న వారికి పొజిషన్ పట్టాలు ఇవ్వనున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు.

రోగులు 'అభా' కార్డులు తెచ్చుకోవాలి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఓపీ సేవలు పొందాలనుకునే రోగులు విధిగా ఆయుష్మాన్ భారత్ (అభా) ఐడీ/ఆధార్, మొబైల్ నంబర్ తీసుకురావాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్వజనాస్పత్రిని డిజిటలైజేషన్ దిశగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ ఐడీ ద్వారా రోగుల ఆరోగ్య వివరాలు భద్రంగా ఉంటాయన్నారు. దేశంలో ఎక్కడికెళ్లినా రోగులు గతంలో పొందిన సేవలు, తదితర సమాచారం సమగ్రంగా నిక్షిప్తమై ఉంటుందని తెలిపారు.





అనంతపురంలో మహిళలతో కలిసి బోనాలతో బయల్దేరిన మంత్రి ఉషశ్రీ చరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ. చిత్రంలో కలెక్టర్ గౌతమి, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం, మాజీ ఎమ్మెల్యే విశ్వ

పండుగలా వాల్మీకి జయంతి

- అనంతపురంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం
- జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ప్రజలు
- బోనాలతో సాగిన శోభాయాత్ర
- వాల్మీకి విగ్రహానికి ప్రముఖుల పుష్పాంజలి





వాల్మీకి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తదితరులు, నగరంలో బోనాలతో సాగుతున్న శోభాయాత్ర

అనంతపురం టవర్‌క్లాక్ / కల్చరల్: రామాయణ ఇతిహాస సృష్టికర్త వాల్మీకి జయంతి అనంతపురంలో పండుగలా సాగింది. బోనాల శోభాయాత్ర, వాల్మీకుల జాతి ఔన్నత్యం చాటే ఆయుధాలతో పాటు ఇరుసు ప్రదర్శన, సాంస్కృతిక కళా రూపాలు ఆకట్టుకున్నాయి. మహర్షి వాల్మీకి జయంతి రాష్ట్రస్థాయి కార్యక్రమం శనివారం నగరంలో జరిగింది. కులమతాలు, పార్టీలకు అతీతంగా అధిక సంఖ్యలో తరలి వచ్చిన ప్రముఖులు, పుర ప్రజలు పాతూరులోని వాల్మీకి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీ తలారి రంగయ్య, కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో 1200 మందికి పైగా మహిళలు బోనాలెత్తుకుని శోభాయాత్ర చేపట్టారు. కేఎస్ఎన్ డిగ్రీ మహిళా కళాశాల సమీపం వరకు ర్యాలీగా వెళ్లి ఉరుముల వాయిద్యాల హోరు, బాజా భజంత్రీల నడుమ బోనాలు సమర్పించారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు వాల్మీకి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు.

వాల్మీకి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కుటుంబ విలువలు, అన్నదమ్ములు, భార్యాభర్తల బంధం, అనుబంధాల గురించి 'రామాయణం' ద్వారా వాల్మీకి అందించిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. బీసీలు ఎక్కువగా ఉన్న అనంతపురం జిల్లాలో వాల్మీకి మహర్షి జయంతి రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించేలా ప్రోత్సహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామన్నారు. అలాగే బీసీల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, పదవుల్లో ఎక్కువగా బీసీలకు అవకాశం కల్పించారని కొనియాడారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి

వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి వాల్మీకి అన్నారు. వాల్మీకి జయంత్యుత్సవాన్ని అనంతలో మూడుసార్లు అధికారికంగా నిర్వహించారన్నారు. వాల్మీకులు విశ్వాసానికి, సాహసానికి మారుపేరన్నారు. సమాజంలో వాల్మీకులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

మధుర కావ్యం రామాయణం..

మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శాలను బోధించే మధుర కావ్యం రామాయణం అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర, రామా యణం గురించి భవిష్యత్‌తరాలకు తెలియజేసి సమాజంలో ఏ విధంగా మెలగాలో అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయంతో పాటు సమ న్యాయం చేస్తూ రాజకీయంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి జగన్ ఎంతగానో ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, వాల్మీకి/ బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, ఎండీ చంద్రశేఖర్ రాజు, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నంలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పని చేసేందుకు ఉమ్మడి జిల్లాలో ఆసక్తి ఉన్న ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ నాగరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కనీసం పదేళ్ల బోధనలో అనుభవం ఉండి, 58 ఏళ్ల లోపు వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. దరఖాస్తుకు సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలు జతచేసి నవంబరు నాలుగో తేదీన సాయంత్రం 5 గంటల్లోపు డైట్ కళాశాలలో అందజేయాలని సూచించారు.

ప్రజాప్రయోజన సేవల కేసుల్లో తప్పనిసరిగా పరిష్కారం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జిల్లా జడ్జి రాజ్యలక్ష్మి

అనంతపురం: న్యాయసేవ అధికార చట్టం కింద ప్రజా ప్రయోజన సేవల కేసుల్లో శాశ్వత లోక్ అదాలత్ తప్పనిసరిగా పరిష్కారం అందిస్తుందని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ కె.శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని న్యాయసేవా సదన్‌లో ప్రభుత్వ అధికారులకు శాశ్వత లోక్ అదాలత్‌లో ప్రజా ప్రయోజన కేసుల పరిష్కారంపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో పలువురు జడ్జీలు ప్రసంగించారు. ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్‌అదాలత్‌లో ఫిర్యాదు దాఖలుకు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్‌అదాలత్ ధర్మాసనం చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ జిల్లా జడ్జి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. సహజ న్యాయ సూత్రాల ఆధారంగానే శాశ్వత లోక్ అదాలత్‌లో వివాద పరిష్కారం జరుగుతుందన్నారు. రాజీ మార్గంలో పరిష్కారానికి కృషి చేస్తూ.. రాజీ కుదరని పక్షంలో తీర్పులు వెలువరించగల అధికారం కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో మధ్యవర్తిత్వ కేంద్ర సభ్యుడు హరికృష్ణ, న్యాయవాది ఇటికె నల్లప్ప పాల్గొన్నారు.

కొంచెమైనా బాధ్యత లేకపోతే ఎలా?

- అందరూ సూచనలిస్తే సమీక్ష చేసేదెవరు..?
- సోషల్ టీచరుతో గణితం, తెలుగు టీచరుతో ఇంగ్లిష్ బోధనా?
- జిల్లాలో 444 మంది ఎస్జీటీలు మిగులు టీచర్లుగా ఉన్నారు
- అర్హులైన వారితో సబ్జెక్టులు బోధించేలా చూడాలి కదా
- విద్యాశాఖ అధికారులకు ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ క్లాస్



ఎంఈఓ వెంకటస్వామిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

అనంతపురం ఎడ్యుకేషన్: 'వార్షిక పరీక్షలు వాయిదా పడిన సంగతి ప్రధానోపాధ్యాయుడికి తెలీదు. చదువులో విద్యార్థులను టీచర్లు ఎలా సన్నద్ధం చేస్తున్నారో పర్యవేక్షించాల్సిన బాధ్యత హెచ్ఎంలు, ఎంఈఓలు, డీవైఈఓలు, డీఈఓలది. వారు తరచూ సమీక్షిస్తుంటే కదా? టీచర్లలో కూడా భయం ఉండేది! ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి హెచ్ఎం దాకా కేవలం సూచనలు చేసుకుంటూ పోతే క్షేత్రస్థాయిలో అమలుపై సమీక్షించేదెవరు? కొంచెమైనా బాధ్యత లేకపోతే ఎలా?' అని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యాశాఖ అధికారులకు క్లాస్ పీకారు. శనివారం ఆయన అనంతపురంలో పర్యటించారు. ముందుగా తారకరామకొట్టాలులోని వైఎస్సార్ నగరపాలక ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. విద్యార్థుల సంఖ్య కంటే ఇద్దరు టీచర్లు మిగులుగా ఉండడంపై ఎంఈఓ వెంకటస్వామిని ప్రశ్నించారు. 3వ తరగతి విద్యార్థిని వర్క్‌బుక్‌ను పరిశీలించారు. సంబంధిత టీచరు కరెక్షన్ చేయలేదు. టీచరును ప్రశ్నించగా విద్యార్థిని పాఠశాలకు సక్రమంగా రావడం లేదని చెప్పగా.. వెంటనే అటెండెన్స్ రిజిష్టర్‌ను ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలించారు. సదరు విద్యార్థిని అందరికంటే కూడా దాదాపు ఎక్కువ రోజులు స్కూల్‌కు వచ్చింది. అడ్డంగా దొరికిపోవడంతో టీచరుతో పాటు ఎంఈఓ, డీఈఓపై కూడా ప్రిన్సిపల్ సెక్రటరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీచర్లకు చదువు తప్ప వేరే కార్యకలాపాలు ఉండవని, మరి విద్యార్థుల వర్క్‌బుక్‌లు కరెక్షన్ చేయడం లేదంటే ఏమనాలని మండిపడ్డారు.

ఇష్టారాజ్యంగా బోధనా..?

అక్కడి నుంచి నేరుగా కోర్టురోడ్డులోని నెహ్రూ ప్రాథమికోన్నత పాఠశాలకు చేరుకున్నారు. 6వ తరగతి గదిలోకి వెళ్లారు. సోషల్ టీచరుతో గణితం, ఎంఏ తెలుగు అర్హత ఉన్న టీచరుతో ఇంగ్లిష్, ఎంఏ బీఈడీ (సోషల్) టీచరుతో సైన్స్ సబ్జెక్టులు చెప్పిస్తుండడంపై మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా 444 మంది ఎస్జీటీలు మిగులుగా ఉన్నారని, వారిలో అర్హత ఉన్నవారు సబ్జెక్టుల బోధనకు లేకపోయారా? అని డీఈఓ, డిప్యూటీ డీఈఓను ప్రశ్నించారు. సిలబస్‌లో కూడా వెనుకబడడంతో హెచ్ఎం గంగాధర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎంగా చేయాల్సిన విధులేంటి అని ప్రశ్నించారు. టీచర్లందరితో మీటింగ్‌లు పెట్టి ఏ సబ్జెక్టు ఎంత వరకు సిలబస్ అయింది అని సమీక్షించకపోతే హెచ్ఎంలు ఎందుకు అని నిలదీశారు. ఈ స్కూల్‌లో టీచర్లందరి ప్రగతిపైనా నివేదిక ఇవ్వాలని డీఈఓను ఆదేశించారు.

ఐటీఐ విద్యార్థులతో భేటీ..

నెహ్రూ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రభుత్వ బాలుర ఐటీఐకు వెళ్లారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్ ఫెయిలై ఐటీఐ చేస్తున్న విద్యార్థులకు అవగాహన కల్పించి ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేలా చూడాలన్నారు. ఏ ఉద్యోగానికైనా కనీస అర్హత ఇంటర్ అనే విషయాన్ని పిల్లలకు తెలియజేయాలన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ వెంట డీఈఓ నాగరాజు, సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావు, డిప్యూటీ డీఈఓ పద్మప్రియ, ఎంఈఓ నాగరాజు, ఏపీఓలు నాగరాజు, నారాయణస్వామి, సెక్టోరియల్ అధికారులు గోపాలకృష్ణ, గోవింద రెడ్డి తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించం

ఆత్మకూరు: ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ హెచ్చరించారు. శనివారం ఆయన ఆత్మకూరు మండలంలోని పి.యాలేరు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో 80 మందిలోపు విద్యార్థులు ఉన్నప్పటికీ నలుగురు ఉపాధ్యాయులు ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. అదనంగా ఉపాధ్యాయున్ని నియమించుకుంటే ప్రభుత్వ సొమ్మును వృథా చేసినట్టేనన్నారు. రెండు తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు ఎలా బోధిస్తారని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు ఇచ్చిన స్మార్ట్ టీవీల ఉపయోగం ఉపాధ్యాయులకు తెలియకపోతే విద్యార్థులకు డిజిటల్ పాఠాలు ఎలా బోధిస్తారని ప్రశ్నించారు. 'మనం చదువుకునేటప్పుడు అమ్మఒడి ఉండేదా? విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ఉండేవా? చదువుకోవాలంటే అప్పట్లో ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రభుత్వం అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన పథకాల ద్వారా సాయం చేస్తోంది. తల్లిదండ్రులపై పైసా ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వమే భరిస్తోంది. అలాంటి పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది' అని ప్రవీణ్‌ప్రకాష్ అన్నారు.

అదనపు నీరు విడుదల చేయించండి

- సీఎస్‌ను కోరిన కలెక్టర్ గౌతమి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: జిల్లాలో చివరి దశలో ఉన్న పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారని, ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి టీబీ డ్యాం నుంచి అదనపు నీటిని విడుదల చేయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.ఎస్.జవహర్‌రెడ్డిని కలెక్టర్ గౌతమి కోరారు. సీఎస్ శనివారం విజయవాడ నుంచి ఎంఎస్ఎంఈ, రెవెన్యూ, రీ–సర్వే, భూ సేకరణ, తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవి పాల్గొన్నారు. జిల్లాలో పంటల పరిస్థితి గురించి సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. హెచ్చెల్సీ కింద 21వేల హెక్టార్లలో వరి సాగు చేశారని, మిరప 34 వేల ఎకరాల్లో వేశారని తెలిపారు. హెచ్చెల్సీకి నవంబరు 10 నుంచి నీరు ఆగిపోనుందన్నారు. అలా జరిగితే చివరి దశలో ఉన్న పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంటుందన్నారు. పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారన్నారు. ప్రభుత్వం తరఫున కర్ణాటకతో మాట్లాడి అదనపు నీటిని విడుదల చేయించాలని కోరారు.

రూ.27 కోట్లు మంజూరు చేయండి

జిల్లాలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు, మరమ్మతులకు రూ.27 కోట్లు పెండింగ్ ఉందని, ఇందుకు అవసరమైన బడ్జెట్ మంజూరు చేయాలని కలెక్టర్ కోరారు. సీఎస్ స్పందిస్తూ ఈ నెల 30లోగా ప్రతిపాదనలు పంపించాలన్నారు. జిల్లాలో రీ–సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, మూడో దశలో 35,088 హద్దు రాళ్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, ఈ ప్రక్రియ త్వరలో పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసగిస్తే కఠిన చర్యలు

అనంతపురం క్రైం: తూకాల్లో మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ అధికారులు హెచ్చరించారు. తూకాల్లో జరుగుతున్న మోసాలపై కొనుగోలుదారులకు అవగాహన కల్పించేందుకు శనివారం నగరంలోని పాతూరులో కాయగూరలు, పూలు, పండ్ల మార్కెట్‌లో అధికారులు ధర్మకాటా ఏర్పాటు చేశారు. వ్యాపారస్తులు వినియోగించే తూనికలు, తూనిక రాళ్లను పరిశీలించారు. వినియోగదారులకు తూకాలలో జరుగుతున్న మోసాలపై కరపత్రాల రూపంలో అవగాహన కల్పించారు. ముద్రలేని కాటాలు, లోపాలు ఉన్న తూనిక రాళ్లను గుర్తించి ఐదు కేసులు కూడా నమోదు చేశారు. తనిఖీల్లో లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ దయాకర్ రెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, ఇన్‌స్పెక్టర్లు మహమ్మద్ గౌస్, శ్రీనివాసులు, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ అక్రమ్, టెక్నికల్ అసిస్టెంట్ మహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం నగరంలోని నారాయణ టెన్నిస్ అకాడమీలో జిల్లా స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్–14 బాలుర విభాగంలో జి. హరీష్ కుమార్, టి. జశ్వంత్, జి. మదన్, కార్తిక్ గౌడ్, అండర్–17లో జి. అరవింద్, కే. మోహన్, ఎస్. రియాజ్, బి. కృపాల్ కుమార్, అండర్–19లో ఎస్. అరుణ్ రొనాల్డినో, ముఫీజ్, రెహమాన్, అండర్–17 బాలికల విభాగంలో ఏ. జాహ్నవి, కే. వైష్ణవి, అండర్–19 విభాగంలో జి. నీరజ ఎంపికయ్యారు.

హత్య కేసులో ఆరుగురి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

నార్పల: హత్య కేసులో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. నార్పల ఎస్సీ కాలనీకి చెందిన సిద్దవటం నారాయణస్వామి (32) ఈ నెల 24న రాత్రి తన స్నేహితులు పెరవలి కుళ్లాయప్ప, ఆకుల మణికంఠ, ఆసాది జయరాం, వరికూటి శివ, కడపల నాగన్న, ఎగువ కుళ్లాయస్వామితో కలసి ఊరి బయట మామిడి తోటలో విందు ఏర్పాటు చేసుకున్నాడు. ఆ సమయంలో స్నేహితుల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. అక్కడే ఉన్న బండరాళ్లతో నారాయణస్వామి తలపై బాది హతమార్చారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

కల్యాణం.. కమనీయం

తాడిపత్రి అర్బన్: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక చింతల వేంకటరమణ స్వామి ఆలయంలో శనివారం కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. కల్యాణ వేదికను వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వారికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను పల్లకీలో ఆలయంలో నుంచి ఎదుర్కోళ్లతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. శ్రీదేవి, భూదేవి మెడలో శ్రీనివాసుడు మాంగల్య ధారణ చేసే ఘట్టాన్ని ఆలయ ప్రధాన అర్చకులు మురళీ స్వామి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణలు, వేదపారాయణాలు,మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా జరిపించారు. కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆపద మొక్కులవాడా అనాథ రక్షకా..గోవిందా గోవింద.. అంటూ పులకించిపోయారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీ ప్రసాద్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



శ్రీదేవి, భూదేవితో వేంకటరమణుడి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

భారత్‌ను అగ్రగామిగా నిలపడమే మోదీ లక్ష్యం

- కేంద్ర మంత్రి శ్రీపాద యశో నాయక్
- రోజ్‌గార్ మేళాలో 57 మందికి నియామక పత్రాలు అందజేత

గుంతకల్లు: భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ శ్రమిస్తున్నారని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, పర్యాటక శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో భాగంగా శనివారం అనంతపురం జిల్లా గుంతకల్లులోని రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి శ్రీపాదయశోనాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఉద్యోగ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన దాదాపు 57 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధానిగా మోదీ తన తొమ్మిదేళ్ల పాలనలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది రోజ్‌గార్ మేళా ద్వారా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో విజయం సాధించిన 51,000 మందికిపైగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశామన్నారు. క్రీడలు, సాంకేతికత, సైన్స్, చిన్న తరహా పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ఉద్యోగాలను సృష్టించినట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఎలాంటి షరతులు లేకుండా ముద్రలోన్లు అందజేస్తుండడంతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. నేడు ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని, ఈ ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని అన్నారు. ఇటీవల ఆసియా క్రీడల్లో విజయాలు, చంద్రయాన్–3 విజయవంతం కావడం మోదీ ఘనతకు నిదర్శనాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) మనీష్ అగర్వాల్, ఏడీఆర్‌ఎం సూర్యనారాయణ, సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీసీఎం మనోజ్, ఆర్‌పీఎఫ్ డివిజనల్ కమిషనర్ టీ.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థికి నియామక పత్రం అందజేస్తున్న కేంద్రమంత్రి శ్రీపాద యశో నాయక్

నెట్టికంటుడిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

గుంతకల్లు రూరల్: కేంద్ర పర్యాటక, ఓడరేవుల శాఖ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. వేకువజామునే ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యుల పేరున స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు, స్వామి ఫొటో జ్ఞాపికను అందజేశారు. రైల్వే డీపీఓ చౌహాన్, పలువురు బీజేపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

అనంతలో భారీ చోరీ!

అనంతపురం క్రైం: నగరంలో భారీ చోరీ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రెండో రోడ్డు మిత్రా హోటల్ వెనుకవైపు ఓ ఇంట్లో పెద్ద ఎత్తున బంగారం, పంచలోహ విగ్రహాలు, కొంత నగదు అపహరించుకెళ్లినట్లు సమాచారం. డీఎస్పీ ప్రసాద్‌రెడ్డితో పాటు త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్, సీసీఎస్ సీఐ జీటీ నాయుడు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.

బాధితుల సమాచారం మేరకు..

స్థానిక రెండో రోడ్డులో చంద్రశేఖర గుప్తా, ఆదిశేషు గుప్తా అనే సోదరులు నివాసం ఉంటున్నారు. వీరిది ఉమ్మడి కుటుంబం. రెండు రోజుల క్రితం శ్రీరంగపట్నానికి వ్యక్తిగత పనిపై వెళ్లిన ఆదిశేషు గుప్తా శుక్రవారం అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం ఇంట్లోని బీరువా తెరిచిన ఆదిశేషు గుప్తాకు బంగారు నగలు కొన్ని కనిపించలేదు. తమ దుకాణంలో వ్యాపారం చేయగా వచ్చిన చిల్లర డబ్బు రూ.20 వేలు కూడా లేవు. దేవుడి గదిలో చూడగా పంచలోహాలతో తయారు చేసిన రెండు శ్రీమంజునాథస్వామి విగ్రహాలతో పాటు ఆంజనేయస్వామి విగ్రహం కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.

గ్రిల్ విరిచి లోపలకు ప్రవేశించిన ఆనవాళ్లు..

చోరీ జరిగిన ఇంటి వెనుక వైపు కొత్తగా నిర్మించిన బాత్ రూమ్‌పై నుంచి వచ్చేందుకు ఒక మార్గం ఉందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఇంటి తలుపు గడియ తీసి లోపలకు ప్రవేశించి ఉండవచ్చని భావిస్తున్నారు. బంగారం కిలో దాకా పోయినట్లు బాధితులు చెబుతున్నా, ఇంకా ఓ అరలో 75 తులాలు, మరో అరలో 35 తులాలు ఉందని పోలీసులు తెలిపారు. ఇంట్లో చాలా చోట్ల వెండి వస్తువులున్నట్లు గుర్తించారు. బాధితులు చెబుతున్నట్లుగా దొంగలు పడి ఉంటే వాటిని ఎందుకు వదిలేసి వెళతారని అనుమానిస్తున్నారు. అసలు చోరీ ఎప్పుడు జరిగిందో కూడా బాధిత కుటుంబ సభ్యులకు తెలియకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

వన్‌టౌన్ పోలీసుల అదుపులో దొంగ?

ఈ క్రమంలోనే ఓ వ్యక్తి పెద్ద ఎత్తున బంగారాన్ని అమ్మేందుకు బేరం పెట్టాడనే సమాచారం రావడంతో పోలీసులు రంగంలోకి దిగి, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక గుత్తి రోడ్డులోని ఓ హోటల్‌లో పని చేసే సప్లయర్ అని సమాచారం. అతని వద్ద నుంచి అరకిలో దాకా బంగారం రికవరీ చేసినట్లు తెలిసింది. గుజరాత్‌వాసిగా నిర్ధారించారు.

వివాహిత ఆత్మహత్య

గుంతకల్లు రూరల్: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంతకల్లు మండలంలోని తిమ్మాపురం గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన నేసే చౌడయ్య, పార్వతి (41) దంపతులు. మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నారు. ముగ్గురు కుమార్తెలు సంతానం కాగా, ఇద్దరికి పెళ్లిళ్లయ్యాయి. చిన్న కుమార్తె పట్టణంలోని శంకరానంద కళాశాలలో ఇంటర్ చదువుతోంది. పార్వతి కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూపించుకున్నా నయం కాలేదు. ఈ క్రమంలో శనివారం ఉదయం భర్తను మాత్రల కోసమని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి పంపింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన చౌడయ్య ఎంత పిలిచినా భార్య తలుపు తెరవక పోవడంతో మిద్దె పైకి ఎక్కి చూశాడు. పార్వతి ఉరికి వేలాడుతుండడం చూసి కన్నీరుమున్నీరయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సర్వమతాల సారం ఒక్కటే

- డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం క్రైం: సర్వమతాల సారం ఒక్కటేనని డీఐజీ ఆర్.ఎస్. అమ్మిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీసు కార్యాలయ ఆవరణలో ఉన్న మహబూబ్ సుబహాని దర్గాలో గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్ హాజరయ్యారు. దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు సంబంధించిన ప్రార్థనా మందిరాలు ఇక్కడ ఉన్నాయన్నారు. ఆయా మతాల పర్వదినాలు నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందరూ కలిసి మెలసి ఉండడం, భోజనాలు చేయడం శుభపరిణామమన్నారు. పోలీసు కుటుంబాలే కాకుండా నగర ప్రజలకు ఎస్పీ భోజనాలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్

ఎస్పీ పెద్దమనసు..

ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పెద్దమనసు చాటుకున్నారు. గ్యార్మీ పర్వదినం కొంత మందికే పరిమితం కాకుండా అందరూ సంతోషంగా చేసుకోవాలనే సదుద్దేశంతో నగర పరిసరాల్లో ఉన్న వృద్ధాశ్రమాలు, మహిళలు, అంధుల ఆశ్రమాలకు భోజనాలు పంపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, హనుమంతు (ఏఆర్), ఏఆర్ డీఎస్పీ మునిరాజు, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ శంకర్, లీగల్ అడ్వయిజర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్పీ సీసీ ఆంజనేయ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శివ, దర్గా కమిటీ సభ్యులు మసూద్ వలీ, షెక్షావలి, నాగరాజు, ఖాదర్ వలి, లింగమయ్య, బాబా ఫకృద్దీన్, దౌలా, రహిమాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవే ప్రథమ కర్తవ్యం

అనంతపురం క్రైం: పోలీసులకు ప్రజా సేవే ప్రథమ కర్తవ్యమని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక పోలీసు క్వార్టర్స్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. రక్తదానం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలకు విశేష స్పందన లభించిందన్నారు. యువత సేవా భావం అలవరుచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, ఆపరేషన్ల సమయంలో అవసరమైన వారికి రక్తదానం చేయడం అదృష్టంగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఏ అనంతపురం బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంకు ఆఫీసర్ శంకర్, రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ మోహన్‌కృష్ణ, సీఐలు విశ్వనాథచౌదరి, ఆర్‌ఐలు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్పీ అన్బురాజన్

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

అనంతపురం క్రైం: పోలీసులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా శనివారం జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న శ్రీ కోదండరామాలయ కల్యాణ మంటపంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. కిమ్స్ సవీర ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీలు విజయభాస్కర్ రెడ్డి, రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, సీఐ దేవానంద్, ఆర్‌ఐలు హరికృష్ణ, రాముడు ఇలా మొత్తం 120 మంది పోలీసు సిబ్బంది బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఈసీజీ 2డీ ఎకో పరీక్షలు చేయించుకున్నారు. కాగా, మెడికల్ క్యాంపులో మీడియా ప్రతినిధుల కోసం కూడా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఈసీజీ, 2డీ ఎకో టెస్టులు చేశారు.

గొంతు కోశారా? కోసుకుందా?

తాడిపత్రి: ఓ మహిళ పక్కింటి వారు తన గొంతు కోశారంటూ ఆస్పత్రికి వచ్చింది. ఏదో విషయమై మందలించినందుకు తనే కోసుకుని తమపై నెపం నెట్టిందని పక్కింటి వారు ఆరోపించారు. వివరాలు.. స్థానిక భగత్ సింగ్ నగర్‌లో ఉంటున్న లింగుట్ల లక్ష్మీదేవి, జయరాముడు దంపతులు. లక్ష్మీదేవి శనివారం సాయంత్రం గొంతుకు గాయమైన స్థితిలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. తమ పక్కింట్లో నివాసం ఉంటున్న శాంతమ్మ, రాజమ్మ, ఉమా అనే మహిళలు గొంతు కోశారని తెలిపింది. పట్టణ సీఐ హమీద్‌ఖాన్ అక్కడికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. నిందితులను విచారించారు. తమ నివాసాల ఎదుట నిత్యం ఏవో పూజలు చేస్తూ కుంకుమ, పసుపు, నిమ్మకాయలు, పూలు వంటి వాటిని లక్ష్మీదేవి పడవేసేదని, దీంతో తాము ఆమెను గతంలో హెచ్చరించామని వారు వెల్లడించారు. ఇంటి యజమాని కూడా లక్ష్మీదేవిని ఇంటిని ఖాళీ చేయాల్సిందిగా రెండు రోజుల క్రితం చెప్పాడన్నారు. ఈ క్రమంలో ఆమె గొంతు కోసుకుని తమపై ఆరోపణలు చేసినట్లు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండడంతో లక్ష్మీదేవిని మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. పూర్తి స్థాయిలో విచారిస్తున్నట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.



గాయపడిన లక్ష్మీదేవి

అనుమానాస్పద స్థితిలో మహిళా కూలీ మృతి



మృతి చెందిన నగ్మా

బుక్కరాయసముద్రం: అనుమానాస్పద స్థితిలో మహిళా కూలీ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని ఓ మిల్లులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. బీకేఎస్ మండల కేంద్రానికి చెందిన రఘు, నగ్మా (30) దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. స్థానిక తాడిపత్రి రహదారి పక్కన ఉన్న బాలాజీ దాల్ మిల్లులోకి నగ్మా దినసరి కూలీగా వెళుతోంది. శనివారం మిల్లుకు వెళ్లిన నగ్మా.. సాయంత్రమైనా రాలేదు. దీంతో రఘు మిల్లులోకి వెళ్లి యజమానులను ప్రశ్నించాడు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానమొచ్చింది. ఈ క్రమంలోనే ఓ కూలీ చెప్పిన ప్రకారం రఘు లోపలికి వెళ్లి చూడగా, మిషన్ వద్ద నగ్మా విగతజీవిగా కనిపించింది. మిల్లు నిర్వాహకులు దొడ్డిదారిన బయటకు వెళ్లిపోయారు. ఆగ్రహించిన బంధువులు మృతదేహంతో మిల్లు ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్వా ఉత్పత్తుల వాడకాన్ని పెంచాలి

అనంతపురం అగ్రికల్చర్: ఆక్వా రంగ అభివృద్ధిలో భాగంగా చేపలు, రొయ్యలు, పీతల ఆహారోత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకూ కర్నూలులో రాయలసీమ స్థాయి ప్రాన్స్, ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ జరగనుంది. దీనిపై మత్స్యశాఖ డీడీ డాక్టర్ కె.శాంతి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను శనివారం కలెక్టరేట్‌లో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ ఉమామహేశ్వరమ్మతో కలిసి కలెక్టర్ గౌతమి విడుదల చేశారు. కార్యక్రమం అనంతరం డీడీ శాంతి విలేకరులతో మాట్లాడారు. ఫుడ్ ఫెస్టివల్‌లో తిరుపతి, చిత్తూరు జిల్లాలు మినహా మిగిలిన రాయలసీమ జిల్లాల మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది, మత్స్యకార సంఘాల సభ్యులు, చేపల పెంపకందారులు పాల్గొంటారని తెలిపారు. చేపలు, రొయ్యలు, పీతల నుంచి తయారు చేసిన ఆహారోత్పత్తులను రూ.399 ప్రకారం విక్రయిస్తారన్నారు.

పరీక్ష ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో నిర్వహించిన పలు పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఎంటెక్ నాలుగో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్ ఫలితాలు, ఫార్మా.డీ మూడో సంవత్సరం రెగ్యులర్, బీఫార్మసీ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ (ఆర్–19), బీఫార్మసీ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ, బీఫార్మసీ రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19, ఆర్– 15) సప్లిమెంటరీ , బీఫార్మసీ ఒకటో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19) సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి. చంద్రమోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్ http://jntuaresults.ac.in చూడాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడులు

వజ్రకరూరు: మండల పరిధిలోని చాబాల గ్రామ శివారులో శనివారం పేకాట స్థావరంపై ఉరవకొండ రూరల్ సీఐ ఎన్. ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. 10 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. రూ. 17,240 స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో చాబాల గ్రామానికి చెందిన వారు 9 మంది, విడపనకల్లు మండలం ఎన్.తిమ్మాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ ఎన్.ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.

బాలిక మిస్సింగ్.. గంటల వ్యవధిలో పట్టివేత

కళ్యాణదుర్గం: తల్లిదండ్రులకు తెలియకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ బాలికను 'దిశ' పోలీసులు గంటల వ్యవధిలో పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కళ్యాణదుర్గం వడ్డే కాలనీలో నివాసముండే సురేష్ అనే వ్యక్తి తన కుమార్తె కనిపించడం లేదని శుక్రవారం 11 గంటల సమయంలో దిశాయాప్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే హుటాహుటిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబసభ్యులతో వివరాలు సేకరించారు. తనతో పాటు సెల్‌ఫోన్ తీసుకెళ్లినట్లు తెలుసుకున్న పోలీసులు.. సిగ్నల్ ఆధారంగా అనంతపురం దగ్గర్లోని ఓ గ్రామంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకుని బాలికను తీసుకొచ్చి తల్లిదండ్రులకు శనివారం అప్పగించారు. కాల్ చేసిన గంటల వ్యవధిలో కుమార్తెను క్షేమంగా అప్పగించడంతో పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉచితంగా కార్పొరేట్ వైద్యం

అనంతపురం మెడికల్/ఆత్మకూరు: 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాల్లో ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం లభిస్తోందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. శనివారం అనంతపురం నగరం, ఆత్మకూరు మండలం సనప గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి రోగికీ మందులు ఇవ్వాలన్నారు. సమస్యకనుగుణంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సాయంత్రం వరకు స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండా లని ఆదేశించారు. అవసరమైన వారిని జిల్లా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేయాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుజాత తదితరులున్నారు. కాగా, జిల్లాలోని 11 ప్రాంతాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. 5,670 మంది ఓపీ సేవలు వినియోగించుకోగా, 539 మందిని వివిధ ఆస్పత్రులకు రెఫర్ చేసినట్లు వెల్లడించారు. 854 మంది 'వైఎస్సార్ కంటి వెలుగు' కింద సేవలు పొందినట్లు తెలిపారు.

క్లుప్తంగా

నేటిలోపు జాబితా సరిచూసుకోండి

ఆత్మకూరు: ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులు ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన జాబితాలో పేర్లను పరిశీలించి, తప్పులుంటే ఆదివారం లోపు సరిచేసుకోవాలని ఈఏఓ సుజిత తెలియజేశారు. శనివారం మండలంలోని పి.యాలేరు గ్రామంలో వైస్ ఎంపీపీ నీలిమ, సర్పంచ్ ఆరోగ్యంరెడ్డితో కలిసి రైతు భరోసా కేంద్రంలో ఈక్రాప్ బుకింగ్ అయిన రైతుల పేర్ల జాబితాను తెలియజేశారు.

ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయండి



కేంద్రమంత్రికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: సేవాఘడ్‌లో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని, సేవాఘడ్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సేవాఘడ్ ఉపాధ్యక్షురాలు సుమతి సురుతాని, కోశాధికారి బాలానాయక్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్ తదితరులు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి శ్రీపాద యశోనాయక్‌ను కోరారు. శనివారం కేంద్ర మంత్రి శ్రీపాద యశోనాయక్ సేవాఘడ్‌ను సందర్శించారు. ఈసందర్భంగా గిరిజనుల ఆరాధ్య దైవం కొలువైన సేవాఘడ్ అభివృద్ధికి సహకరించాలని సేవాఘడ్ సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యుడు కోరారు. ఇందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి, సేవా గడ్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

మౌనగిరి క్షేత్రంలో రాష్ట్ర స్థాయి భజన పోటీలు



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రాప్తాడు: హంపాపురం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై వెలసిన మౌనగిరి 39 అడుగుల అభయాంజనేయ స్వామి సన్నిధిలో నవంబర్ 23న రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు మౌనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య స్వామి తెలిపారు. శనివారం ఆయన 39 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో భజన పోటీల పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి బహుమతి రూ.20,116, రెండో బహుమతి రూ.15,116, మూడో బహుమతి రూ.10,116, నాల్గో బహుమతి రూ.7,116 పంపిణీ చేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు నవంబర్ 20లోపు రూ.250 ఎంట్రీ ఫీజు చెల్లించి, పేర్లునమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం సెల్: 97054 52005, 70136 46171, 94904 81815, 94907 66449లో సంప్రదించాలన్నారు.

ఆలయాల మూసివేత



కాశీవిశ్వేశ్వరాలయాన్ని మూసివేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల తలుపులు రాహుగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా మూసివేశారు. శనివారం 12 గంటల నుంచే పలు ఆలయాల్లో పూజలు నిలిపివేశారు. స్థానిక మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి, హర్షశర్మ మాట్లాడుతూ చంద్ర గ్రహణంతో ఆలయంలో శనివారం జరగాల్సిన పూజలు నిలిపివేశామని, ఆదివారం తెల్లవారుజామున ఆలయ శుద్ధి, గ్రహణ పూజల అనంతరం 7 గంటల తర్వాత దర్శనభాగ్యం కల్పిస్తామన్నారు.

పంట కోతలకు వచ్చేవరకూ నీరు ఇవ్వాలి

అనంతపురం అర్బన్: హెచ్ఎల్‌సీ, జీబీసీ, హంద్రీనీవా కాలువల కింద సాగు చేసిన పంటలు కోతకు వచ్చే వరకు సాగునీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని సీపీఎం అనుబంధ ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సంఘాల జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య, కృష్ణమూర్తి మాట్లాడారు. ఉరవకొండ, రాయదుర్గం, గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో హెచ్ఎల్‌సీ ఆయకట్టు కింద 80 వేల ఎకరాలు, హంద్రీ–నీవా కాలు వకింద 20వ వేల ఎకరాలకు పైగా మిర్చి, మొక్క జొన్న, పత్తి, జొన్న, కంది, తదితర పంటలు సాగు చేశారన్నారు. కార్యక్రమంలో పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, నాయకుడు వన్నూరప్ప పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి అపహరణ

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్ల దిగువ తండాకు చెందిన పద్మావతి అనే మహిళా రైతు పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, అందులోని సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఆత్మకూరు, మదిగుబ్బ, సనప, వేపచెర్ల గ్రామాల్లో పదుల సంఖ్యలో పొలాల్లోని స్టార్టర్లు, వైర్లు ఎత్తుకెళ్లారు.

వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



తోపుదుర్తిలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహం



బోనాలు ఎత్తుకొని వెళ్తున్న మహిళలు



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం: వాల్మీకి మహర్షి జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎస్కేయూలోని ఫార్మసీ కళాశాలలో వాల్మీకి జయంతి వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు నూతనంగా నిర్మించిన ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌ను వీసీ ప్రారంభించారు. నూతన సెమినార్ హాలులోనే తొలి కార్యక్రమంగా వాల్మీకి జయంతి నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, తెలుగు విభాగం ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎస్ఆర్ సదాశివా రెడ్డి, సదస్సు కోకన్వీనర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ చంద్రాయుడు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శం

అనంతపురం రూరల్: వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శమని, ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని వాల్మీకి సంఘం నాయకులు అక్కులప్ప, నాగేంద్ర అన్నారు. శనివారం రుద్రంపేట పంచాయతీ విమలా ఫరూక్ నగర్‌లో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు ఆకులప్ప, ప్రసాద్ మాట్లాడుతూ రామాయణాన్ని రచించి ప్రపంచానికి గొప్ప సందేశం అందించిన వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, సాకే అక్కులప్ప, బోయ ప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంపొందించుకోవాలి

• జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలు పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలు ఆవరణలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ మానవతా విలువలు, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణం అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, హనుమంతు (ఏఆర్), ఏఆర్ డీఎస్పీ మునిరాజు, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ శంకర్, సిబ్బంది, సీఐలు ఇందిర, విశ్వనాథ్‌చౌదరి, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శివ పాల్గొన్నారు.

తోపుదుర్తిలో వాల్మీకి జయంతి

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తి గ్రామంలో శనివారం భక్తి శ్రద్ధలతో వాల్మీకి జయంతి నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువతులు పెద్ద ఎత్తున బోనాలను ఎత్తుకొని వాల్మీకి విగ్రహం వద్దకు చేరుకొని పూజలు చేశారు. వాల్మీకి విగ్రహానికి ప్రత్యేకంగా పూల మాలలు వేసి, పూజలు చేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి

రాప్తాడు: మండల కేంద్రంలో వాల్మీకి జయంతి వేడుకలు వాల్మీకి నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ రామాంజనేయులు, నాయకులు రాము, నారాయణ, రామలింగమయ్య, సింగారప్ప, వెంకటరాముడు, వన్నూరప్ప తదితరులు వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి, వేడుకలు నిర్వహించారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

• రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు మంజూరు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండాలోని వివిధ అంశాలపై సభ్యులు చర్చించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ 90 రోజుల కార్యక్రమం కింద ఇంటి పట్టాలకోసం వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం జరుగుతోందన్నారు. అవసరాల మేరకు ప్రాధాన్యక్రమంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. అందుబాటులో ఉన్న నిధులను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పనులు చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ పుల్లయ్య, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి కన్వీనర్ ఆలమూరు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాధనాన్ని దోపిడీ చేసిన చంద్రబాబు

• రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ అధినేత చంద్రబాబుతో ఆ పార్టీ నాయకులు రూ.కోట్ల ప్రజాధనాన్ని దోపిడీ చేశారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని వడ్డిపల్లిలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డితో పాటు జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బ్రోచర్‌లు అందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలు వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు గత టీడీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన ప్రజాధనం దోపిడీపై ప్రజలకు వివరించారు. గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని టీడీపీ నాయకులు అనేక దోపిడీలకు పాల్పడినారన్నారు. అంతకుముందు వడ్డిపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీలు విజయ్, నీలిమా, సర్పంచ్‌లు నరసింహారెడ్డి, ఓబిలేసు, ఎర్రిస్వామి, ఎంపీటీసీ ఓబిలేసు, జేఎస్ఏ కన్వీనర్ నరసింహారెడ్డి, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

• మున్సిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: ప్రజారోగ్యమే పరమావధిగా పనిచేసే పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని మున్సిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఏజీఎస్ రెడ్డి ఫౌండేషన్, డిస్కవర్ అనంతపురం సంయుక్తంగా ఆ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన అనంత స్వచ్ఛత యోధులు కార్యక్రమంలో 40 మంది పారిశుధ్య కార్మికులకు మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు పంపిణీ చేశారు. కార్మికులను వినూత్నంగా గౌరవిస్తున్న ఏజీఎస్ రెడ్డి ఫౌండేషన్ నిర్వాహకులను ఆర్‌డీ ప్రత్యేకంగా అభినందించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు సైతం సామాజిక బాధ్యతగా చెత్తను ఎక్కడబడితే అక్కడ పడేయరాదని, డస్ట్‌బిన్లు, పుష్‌కార్ట్స్, చెత్త వాహనాలకు అందించి, పారిశుధ్యం మెరుగునకు సహకరించాలన్నారు. ప్రజారోగ్యం కోసం పాటుపడే కార్మికులను సన్మానించి, బహుమతులను అందిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు కేజీ ప్రమీళమ్మ, అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు బాబా, అబూసలేహ, తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు బహుమతులు అందిస్తున్న మున్సిపల్ ఆర్‌డీ, డిప్యూటీ మేయర్

గౌరమ్మకు ప్రత్యేక పూజలు



బోగినేపల్లిలో గౌరమ్మ పూజల్లో పాల్గొన్న మహిళలు



గౌరమ్మను చెరువులో నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్తున్న మహిళలు, యువతులు

రాప్తాడు: తెలంగాణలో బతుకమ్మ పండుగను ఎంత ఘనంగా జరుపుకుంటారో రాప్తాడు మండలంలోనూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా గౌరమ్మ పండుగను మహిళలు, యువతులు, చిన్నారులు అంతే వైభవంగా జరుపుకుంటారు. బోగినేపల్లి, ఎం.బండమీదపల్లి గ్రామాల్లో మూడు రోజులుగా గౌరమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారి విగ్రహాలను పట్టుచీర, గాజులు, పూలతో అలంకరించారు. 'అమ్మామ్మా గౌరమ్మా... మాయమ్మ గౌరమ్మ మా ఇంటి మహాలక్ష్మి నీవమ్మా' అంటూ మహిళలు, యువతులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం ఇళ్ల నుంచి జ్యోతులు తలపై ఎత్తుకొని ఆలయానికి వెళ్లి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి గ్రామ చెరువువద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం మెడికల్: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి జగనన్న ప్రభుత్వం బలోపేతం చేసిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని పాతూరు, ఆజాద్‌నగర్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించారని, ఆ మహానేత కుమారుడు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీని పేదలకు మరింత అందుబాటులోకి తెచ్చారన్నారు. వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఫ్యామిలీ డాక్టర్, 104, 108 సేవలతో పేదలకు వైద్యం భారం కాకుండా చూస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యంతో పాటు మెరుగైన వైద్యం అందించడానికి కార్పొరేట్ ఆస్పత్రులకు కూడా రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్ సుమతి, నాయకులు షరీఫ్, ఖాదర్ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ఘనంగా గౌరీ పూర్ణిమ



ప్రత్యేకంగా తయారుచేసిన గౌరమ్మలతో చిన్నారులు

అనంతపురం రూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో సర్పంచ్ లక్ష్మీదేవి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గౌరీ పూర్ణిమ వేడుకలను శనివారం నిర్వహించారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత గౌరమ్మ పండుగను జరుపుకున్నారు. ప్రత్యేకంగా తయారుచేసిన గౌరమ్మలను చిన్నారులు, మహిళలు ఎత్తుకొని గ్రామంలో ఊరేగించారు.

విద్యారంగ సమస్యలపై ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి



ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా పర్యటనకు వచ్చిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌ను వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు కలిసి విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందించారు. మున్సిపల్ టీచర్లకు సర్వీస్ రూల్స్ వచ్చేదాకా పీఎఫ్ అమౌంట్‌ను డీడీఓల ద్వారా పాత అకౌంట్లకు జమ చేసేలా చూడాలని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి కోరారు. అంతరాష్ట్ర బదిలీలు చేసేలా చూడాలని, 3,4,5 తరగతులు విలీనం అయిన జెడ్పీ, ప్రభుత్వ స్కూళ్లకు ఎస్ఏ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. 302 జీఓ ప్రకారం ఎస్ఏలకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. గురుకులాల్లో పని చేసే కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసేలా చూడాలని కోరారు. పదో తరగతి విద్యార్థులకు మోడల్ ప్రశ్నపత్రాలు, వర్క్ బుక్స్ సరఫరా చేయాలని కోరారు. వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు గోవిందరెడ్డి, నాగిరెడ్డి, రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

రాప్తాడు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేద్దామని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సాల్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల పురోగతి, లక్ష్యాలను అధికారులకు వివరించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అనంతరం విద్య, వైద్యం, పశు, విద్యుత్, శిశు సంక్షేమం, వ్యవసాయ, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఉపాధిహామీ పథకం, హార్టికల్చర్ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వరలక్ష్మీ, ఏపీఎం శివకుమార్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, ఈఓఆర్డీ నరసింహారెడ్డి. ఎంఈఓ మల్లికార్జున, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

చోరీపై పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం క్రైం: నగరంలోని అరవిందనగర్ రెండో క్రాస్‌లో నివాసం ఉంటున్న కులదీప్‌రెడ్డి ఇంట్లో చోరీ ఘటనపై టూటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. వివరాలు..కులదీప్‌రెడ్డి కుటుంబ సభ్యులందరూ రెండు నెలలుగా హిందూపురానికి వెళ్లి ఉంటున్నారు. సమీప బంధువుల అమ్మాయి రోజూ ఇంట్లో దీపం వెలిగించి వెళ్లేది. కొన్ని వస్తువులు తీసుకెళ్లేందుకు కులదీప్‌రెడ్డి శనివారం ఇంటికి వచ్చాడు. అయితే జత కమ్మలు, వెండి నగలు కనిపించకపోవడంతో దీపం వెలిగించే అమ్మాయిని ఆరాతీశాడు. తనకు తెలియదని చెప్పడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుడి వ్రతాలు



బాబా మందిరంలో సత్యదేవుడు



కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

అనంతపురం కల్చరల్: నగరంలో పలు చోట్ల సత్యదేవుడి వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శనివారం స్థానిక మూడోరోడ్డులోని షిర్డీసాయిబాబా మందిరం, మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం, అశోక్‌నగర్‌లోని రమాదేవి సమేత సత్యనారాయణస్వామి ఆలయం తదితర చోట్ల సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా జరిగాయి. అర్చకుల మంత్రోచ్చారణల నడుమ సత్యదేవుడి కథలు వివరించారు. అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవల అనంతరం అన్నప్రసాదం అందించారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం



కల్యాణోత్సవంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి ఆశ్రమంలో శనివారం ఉదయం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. దసరా వేడుకలను పలు దేవతామూర్తుల కల్యాణోత్సవాలతో ముగించన్ను నేపథ్యంలో సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాంగళ్యధారణ, తలంబ్రాలు, ఎదురుకోళ్ల వంటి తంతును సంప్రదాయసిద్ధంగా నిర్వహించిన అనంతరం భక్తులకు అమ్మవారి పసుపు కుంకుమలు, కంకణాలు వితరణ చేశారు. అనంతరం దాతల సత్కారాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అరవింద్, రత్నగిరి దేవరాజ్, గుస్తా పాల్గొన్నారు.

వేపకుంట రాజన్నకు ఎమ్మెల్యే పరామర్శ

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వేపకుంట రాజన్నను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే మండలంలోని తల్లిమడుగుల గ్రామానికి చేరుకొని ప్రమీలమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం రాజన్న, అతని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.